సాక్షి
జనగామ
సోమవారం । 11 । ఆగస్టు । 2025



రామప్ప కీర్తిని చాటేలా..
పర్యాటక జిల్లాగా పేరొందిన ములుగు జిల్లాలోని కూడళ్లను అందంగా తీర్చిదిద్దేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంది. - 8లో



కబ్జా చేశాడు..అద్దెకిచ్చాడు!
చింతగట్టు క్యాంపు సమీపంలో ఓ వ్యక్తి ఎస్సారెస్పీ భూమిని కబ్జా చేసి.. ఆపై ఇసుక లారీల పార్కింగ్‌కు అద్దెకిచ్చాడు. - 8లో

వాతావరణం
గరిష్టం/కనిష్టం 31°/24°
జిల్లాలో ఆకాశం మేఘావృతమై ఉంటుంది. పలుచోట్ల సాధారణ నుంచి మోస్తరు వర్షం కురిసే అవకాశం ఉంది.



జనగామ: బోనాలతో మహిళలు



జనగామ రూరల్: మహంకాళి ఉజ్జయిని మాతకు బోనాలు సమర్పించిన మహిళలు



బచ్చన్నపేట: బోనాలతో వెళ్తున్న మహిళలు



జనగామ: అమ్మవారి కల్యాణంలో పాల్గొన్న భక్తులు

ఊరూరా పోచమ్మ బోనాలు

శ్రావణ మాసాన్ని పురస్కరించిన జిల్లాలోని పలుగ్రామాల్లో ఆదివారం పోచమ్మతల్లికి భక్తులు బోనాలు సమర్పించారు. తల్లుల అనుగ్రహంతో వర్షాలు బాగా కురిసి పంటలు పండి, రైతులు, ప్రజలు సుఖసంతోషాలతో జీవించే విధంగా అమ్మవార్లు దీవించాలని భక్తులు వేడుకున్నారు. ఉదయాన్నే లేచి తమ ఇళ్ల వద్ద బోనాలను తయారు చేసుకుని నైవేద్యం పెట్టి ఆలయాలకు వచ్చి భక్తిశ్రద్ధలతో మొక్కులు చెల్లించుకున్నారు. కోళ్లు, మేకలు, యాటపోతులను బలిచ్చి పూజలు చేశారు. జనగామ పట్టణంలోని 14వ వార్డు టీఎన్జీఓ కాలనీలో పోచమ్మతల్లి కల్యాణం వైభవంగా జరిగింది. అమ్మవారి కల్యాణ మహోత్సవంలో రాజనర్సయ్య, విజయ్ పాల్‌రెడ్డి, దూసరి ధనలక్ష్మి శ్రీకాంత్ దంపతులు పెళ్లి పెద్దలుగా పాల్గొన్నారు. కాలనీతో పాటు చుట్టు పక్కల వార్డుల నుంచి తరలి వచ్చిన భక్తులు అమ్మవారి కల్యాణాన్ని తిలకించారు. అనంతరం భక్తులు అమ్మవారికి బోనాలు సమర్పించి ఒడి బియ్యం పోసి కట్నకానుకలను సమర్పించారు. అనంతరం ఆలయానికి ధనలక్ష్మి, శ్రీకాంత్ దంపతులు రూ.10,116 విరాళంగా ఇచ్చారు. భక్తులు అమ్మవారిని దర్శించుకుని ఆశీర్వచనాలు తీసుకున్నారు. అలాగే పట్టణంలోని కల్లుగీత పారిశ్రామిక సహకార సంఘం జనగామ పట్టణ కమిటీ ఆధ్వర్యంలో గౌడ కులస్తులు మహంకాళి ఉజ్జయిని మాతకు బోనాలు సమర్పించారు.

- జనగామ



స్టేషన్‌ఘన్‌పూర్: శివునిపల్లిలో యాట, బోనంతో వెళ్తున్న భక్తులు

- మరిన్ని ఫొటోలు 9లో

న్యూస్‌రీల్

ప్రజావ్యతిరేక విధానాలపై ఉద్యమం



జనగామ రూరల్: ప్రజావ్యతిరేక విధానాలపై సైనికుల్లాగా ఉద్యమించాలని సీపీఎం రాష్ట్ర సోషల్ మీడియా కన్వీనర్ పిట్టల రవి పిలుపునిచ్చారు. ఆదివారం జిల్లా కార్యాలయంలో జిల్లా కన్వీనర్ భూక్యా చందూనాయక్ అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సామాజిక మాధ్యమాల్లో వామపక్ష భావజాల ఉద్యమం నిర్వహించాలన్నారు. కేంద్ర ప్రభుత్వం కార్పొరేట్ శక్తులకు అప్పగిస్తూ కాలం వెల్లదీస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు రాపర్తి రాజు, ఇర్రి అహల్య, జిల్లా కమిటీ సభ్యులు చుంచు విజయేందర్, బోడ నరేందర్, బెల్లంకొండ వెంకటేష్, ఎదునూరి మదర్, ధరావత్ మహేందర్, వెంకటేష్, ఎల్లేష్, యాదగిరి, గంధ మల్ల మనోహర్, వెంకటస్వామి, తదితరులు పాల్గొన్నారు.

యువత దేశభక్తిని చాటాలి



జనగామ రూరల్: యువకులు దేశభక్తిని చాటుతూ అందరూ ఒక్కతాటిపైకి వచ్చి భారతజాతి ఖ్యాతిని ప్రపంచానికి తెలియజేయాలని బీజేపీ జిల్లా అధ్యక్షుడు సౌడ రమేష్ అన్నారు. బీజేపీ జిల్లా కార్యాలయంలో విభజన గాయాల స్మృతి దినం, హర్ ఘర్ తిరంగా, తిరంగా యాత్ర అంశాలపై ఆదివారం అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖ్యఅతిథిగా ఆయన హాజరై మాట్లాడుతూ జాతీయ పతాకం మన గౌరవానికి ప్రతీక అని, హర్ ఘర్ తిరంగా, తిరంగా యాత్రలో ప్రతీ యువకుడు పాల్గొని దేశభక్తిని చాటాలన్నారు. ప్రధాని నరేంద్రమోదీ జాతి ఐక్యత కోసం నిరంతరం శ్రమిస్తున్నారని, 70 సంవత్సరాలుగా ఉన్న కాశ్మీర్ సమస్యను, 370 ఆర్టికల్‌ను తొలగించారని కొనియాడారు. హర్ ఘర్ తిరంగా కార్యక్రమంలో యువత క్రియాశీలకంగా పాల్గొనాలని, ప్రతీ ఇంటిపై జాతీయ జెండాలు ఎగురవేసేలా ప్రజలను ప్రోత్సహించాలని, గ్రామాల్లో, పట్టణాల్లో తిరంగా ర్యాలీలు చేపట్టాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో తిరంగా యాత్ర కార్యక్రమ జిల్లా కన్వీనర్ శశిధర్‌రెడ్డి, నాయకులు కొంతం శ్రీనివాస్, లక్ష్మారెడ్డి, అంజిరెడ్డి, నర్సింహారెడ్డి, ఈర్ల నవీన్ తదితరులు పాల్గొన్నారు.

శివశంకర్ ఆశయ సాధనకు కృషి చేయాలి



స్టేషన్‌ఘన్‌పూర్: బీసీల అభ్యున్నతికి అహర్నిశలు పాటుపడిన కేంద్రమాజీ మంత్రి, మాజీ గవర్నర్ పుంజాల శివశంకర్ ఆశయ సాధనకు కృషి చేయాలని మున్నూరుకాపు సంఘం జిల్లా అధ్యక్షుడు పోగుల సారంగపాణి అన్నారు. స్టేషన్‌ఘన్‌పూర్ మున్సిపాలిటీ పరిధిలోని చాగల్లులో సారంగపాణి ఆధ్వర్యంలో శివశంకర్ 96వ జయంతిని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాల వేసి పాలాభిషేకం చేశారు. అనంతరం సారంగపాణి మాట్లాడుతూ మున్నూరుకాపు కులానికి చెందిన శివశంకర్ స్వయంకృషితో అంచెలంచెలుగా ఎదిగారని, కేంద్రమంత్రిగా, గవర్నర్‌గా పనిచేయడం మున్నూరుకాపు కులస్తులకు గర్వకారణమన్నారు. ఆయనను స్ఫూర్తిగా తీసుకుని అందరూ కష్టపడి జీవితంలో ఉన్నతస్థానాలకు చేరుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు ఆకుల నాగరాజు, చేపూరి ప్రభాకర్, పొన్న రాజేష్, జాబు శ్రీధర్, రంగు కుమార్, ఎల్లయ్య, రాజు, సమ్మయ్య పాల్గొన్నారు.

బీమాతో ధీమా

రైతు బీమాకు ఈ నెల 13న చివరి తేదీ
- ఏఈఓల వద్ద దరఖాస్తులు
- జూన్ 5 నాటికి పట్టాదారు పాస్‌బుక్కులు వచ్చిన వారికి మాత్రమే..
- జిల్లాలో 1.16 లక్షల మంది రైతులకు లబ్ధి


జనగామ: రాష్ట్ర ప్రభుత్వం రైతు కుటుంబాలకు భరోసా కల్పించేందుకు రైతు బీమా పథకం అమలు చేస్తుంది. అన్నదాతల కోసం ప్రత్యేకంగా రూపొందించిన సామూహిక జీవిత బీమా పథకం, రైతు అనుకోకుండా మరణించిన సమయంలో బాధిత కుటుంబానికి ఆర్థిక భరోసా దొరుకుతుంది. నాటి బీఆర్‌ఎస్ ప్రభుత్వం 2018 ఆగస్టు 14వ తేదీన పథకాన్ని ప్రారంభించగా, ప్రస్తుత కాంగ్రెస్ సర్కారు కూడా బీమా పథకాన్ని కొనసాగిస్తోంది. రైతులు బీమా కంపెనీకి చెల్లించే ప్రీమియం డబ్బులను ప్రభుత్వం వందశాతం భరిస్తుంది. ఇందులో కొత్తగా పట్టాదారు పాస్ పుస్తకాలు పొందిన రైతులు చేరేందుకు మరో అవకాశం ఇచ్చారు.

జిల్లాలో 1.16 లక్షల మంది రైతులు

జిల్లాలో 1,16,036 మంది రైతులు రైతు బీమా పథకం ద్వారా లబ్ధి పొందుతున్నారు. ఈ ఏడాది జూన్ 5వ తేదీ వరకు కొత్తగా పట్టాదారు పాస్ పుస్తకాలు పొందిన రైతులతో పాటు ఇప్పటి వరకు ఈ పథకంలో అవకాశం రాని వారు బీమా కోసం ఈనెల 13వ తేదీలోపు దరఖాస్తు చేసుకోవాలి. గ్రామాల్లో ఏఈఓలు రైతు బీమాకు సంబంధించి కొత్త రైతులు చేసుకునే దరఖాస్తుల ఆధారంగా వివరాలను నమోదు చేసుకుంటారు. దరఖాస్తు చేసుకునే సమయంలో పట్టాదారు పాస్ పుస్తకం (జిరాక్స్) తహసీల్దార్ డిజిటల్ సంతకం చేసిన డీఎస్ పేపర్, రైతు, నామినీ ఆధార్ కార్డుతో ఏఈఓలకు దరఖాస్తు చేసుకోవాలి. ఆధార్ కార్డులో 18 సంవత్సరాల నుంచి 59 ఏళ్ల వయస్సు ఉన్న వారు మాత్రమే అర్హులు.

553 మందికి బీమా సొమ్ము

జిల్లాలో 1.16 లక్షల మంది రైతులు రైతు బీమాలో ఉండగా, ఇప్పటి వరకు 597 మంది మరణించారు. ఇందులో 553 మంది బాధిత కుటుంబాలకు రూ.5లక్షల చొప్పున బీమా సొమ్ము అందించారు. మరో 44 మంది జాబితా ఏఈఓల వద్ద విచారణలో ఉండగా, ఇటీవల 11 మంది లిస్టును అప్రూవల్ చేశారు. కొత్త దరఖాస్తుల కోసం ఈ నెల 13వ తేదీ వరకు అవకాశం ఇవ్వగా, 12 వేల మంది రైతులు ఉండవచ్చని సమాచారం. రైతుల దరఖాస్తుల ప్రక్రియ ముగిసిన వెంటనే ప్రభుత్వం వారికి బీమాకు అవకాశం కల్పించనుంది. బీమాలో చేరిన రైతులు సహజ, ప్రమాదవశాత్తు ఎలా మరణించినా.. బీమా వర్తిస్తుంది. రైతు మరణించిన వెంటనే సంబంధిత అధికారి నివేదిక తయారు చేసి, ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేస్తారు. క్లెయిమ్ ప్రాసెస్ పూర్తి కాగానే, 15 రోజుల లోపు ఎల్‌ఐసీ సంస్థ రైతు నామినీ బ్యాంకు ఖాతాలో రూ.5లక్షల నగదు జమ చేస్తుంది.



మండలాల వారీగా బీమా వివరాలు

మండలం	రైతులు	మృతి చెందిన వారు	క్లెయిమ్స్
బచ్చన్నపేట	10,773	59	56
చిల్పూరు	8,165	36	34
దేవరుప్పుల	10,934	55	51
స్టేషన్‌ఘన్‌పూర్	9,024	42	39
జనగామ	10,390	57	50
కొడకండ్ల	6,384	26	26
లింగాలఘణపురం	9,315	51	47
నర్మెట	6,908	34	29
పాలకుర్తి	15,986	75	70
రఘునాథపల్లి	12,499	69	65
తరిగొప్పుల	5,667	25	23
జఫర్‌గఢ్	9,991	68	63

సద్వినియోగం చేసుకోవాలి



జిల్లాలో ఈ ఏడాది జూన్ 5వ తేదీ వరకు కొత్తగా పట్టాదారు పాస్ పుస్తకాలు పొందిన రైతులు రైతు బీమాకు దరఖాస్తు చేసుకోవాలి. గ్రామాల్లో ఏఈఓలు రైతుల బీమా వివరాల నమోదు కార్యక్రమాన్ని చేపడతారు. ఈ అవకాశాన్ని అర్హత కలిగిన ప్రతీ రైతు సద్వినియోగం చేసుకోవాలి. బీమా ప్రీమియం ప్రభుత్వమే చెల్లిస్తుంది.

- రిజ్వాన్ బాషా, కలెక్టర్

దేవాదుల పనుల్లో నిర్లక్ష్యం వీడాలి



సమీక్షలో మాట్లాడుతున్న భారీ నీటి పారుదలశాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, చిత్రంలో డిప్యూటీ సీఎం మల్లు భట్టివిక్రమార్క, మంత్రులు సీతక్క, కోమటిరెడ్డి, వాకిటి శ్రీహరి, ఎంపీ బలరాంనాయక్, ఎమ్మెల్యేలు

- కాంట్రాక్టర్లు చిత్తశుద్ధితో పనిచేయాలి
- అధికారుల పనితీరులో మార్పు రావాలి
- భారీ నీటి పారుదలశాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి
- సమ్మక్క–సాగర్ బ్యారేజీ, దేవాదుల వద్ద పంపుహౌస్ పరిశీలన

ఏటూరునాగారం/కన్నాయిగూడెం: గోదావరి జలాలను పూర్తిస్థాయిలో సద్వినియోగం చేసుకుంటామని, దేవాదుల పనుల్లో కాంట్రాక్టర్లు, అధికారులు నిర్లక్ష్యం వీడాలని, పనులు పెండింగ్‌లో ఉంటే వెంటనే తన దృష్టికి తీసుకురావాలని భారీ నీటి పారుదలశాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి అన్నారు. ములుగు జిల్లా కన్నాయిగూడెం మండలం తుపాకులగూడెంలోని సమ్మక్క–సాగర్ బ్యారేజీ, దేవాదుల వద్ద పంపుహౌస్‌ను డిప్యూటీ సీఎం భట్టివిక్రమార్క, మంత్రులు సీతక్క, కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, వాకిటి శ్రీహరి, ఎంపీ బలరాం నాయక్‌తో కలిసి మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి సందర్శించారు. తుపాకులగూడేనికి హెలికాప్టర్‌లో చేరుకున్న మంత్రులకు మంత్రి సీతక్క ఆహ్వానం పలికారు. ఆ తర్వాత సమ్మక్క బ్యారేజీ వద్ద 59 గేట్లను పరిశీలించారు. నీటి నిల్వలు ఏ మేరకు ఉన్నాయని, గేట్లు ఎన్ని ఎత్తి, ఎన్ని మూశారని తెలుసుకున్నారు. అక్కడి నుంచి కాన్వాయిలో దేవాదుల పంపుహౌస్ వద్ద ఉన్న గోదావరి నీటి నిల్వలను పరిశీలించి మోటార్లు ఎన్ని నడుస్తున్నాయని, ఎంత నీరు ఎత్తిపోశారని ఆరా తీశారు. ఇరిగేషన్ ఈఎన్‌సీ వెంకటేశ్వర్‌రావు ప్రొజెక్టర్ ద్వారా మంత్రులకు దేవాదుల స్థితిగతులను వివరించారు. అనంతరం సమీక్షలో మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి మాట్లాడుతూ గోదావరి జలాలపై కాంగ్రెస్ ప్రభుత్వం ప్రత్యేక ఫోకస్ పెట్టిందని, ఈ హైలీ ప్రాజెక్టును టీడీపీ, బీఆర్‌ఎస్ పూర్తి చేయలేదని పేర్కొన్నారు. అప్పుడు చేపట్టింది కాంగ్రెస్ ప్రభుత్వమే, ఇప్పుడు పూర్తి చేసేది కూడా కాంగ్రెస్ ప్రభుత్వమేనని ఆయన స్పష్టం చేశారు. ఇరిగేషన్‌కు రూ.23వేల కోట్లు బడ్జెట్‌లో కేటాయిస్తే రూ.16 వేల కోట్లు వడ్డీలు కట్టేందుకే సరిపోతుందన్నారు. కావేరి, గోదావరికి అనుసంధానంగా 200 టీఎంసీల కెపాటీగల ఇచ్చంపల్లి, తుమ్మడిహెట్టి ప్రాజెక్టును నిర్మించి తీరుతామన్నారు. ఛత్తీస్‌గఢ్ రాష్ట్రంలోని మంత్రులతో మాట్లాడి ఎన్‌ఓసీ కూడా తీసుకుంటామని పేర్కొన్నారు.

6 లక్షల ఎకరాలకు సాగు నీరు : డిప్యూటీ సీఎం మల్లు భట్టివిక్రమార్క

ఉపముఖ్యమంత్రి భట్టివిక్రమార్క మాట్లాడుతూ 17 నియోజకవర్గాల్లో 6 లక్షల ఎకరాలకు సాగు నీరు ఇవ్వాలని లక్ష్యంగాపెట్టుకొని దేవాదుల ప్రాజెక్టు నిర్మించామని తెలిపారు. ఇప్పుడు దీని అంచనాలు కూడా మరింత పెరిగే అవకాశం ఉందన్నారు. 16.38 టీఎంసీల నుంచి 17.38 టీఎంసీలకు పెంచాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. రూ.16 కోట్లు దేవాదుల భూ నిర్వాసితులకు ఇవ్వడానికి సిద్ధంగా ఉన్నాయని వివరించారు. పెండింగ్‌లో ఉన్న బిల్లులను వెంటనే చెల్లిస్తామన్నారు. 72 మీటర్ల నీటిని నిల్వ చేసుకొని మోటార్ల ద్వారా ఎత్తిపోసి రిజర్వాయర్ల నుంచి కెనాల్ ద్వారా సాగు నీరు అందిస్తామని తెలిపారు.

ములుగు జిల్లాకు న్యాయం చేయాలి : మంత్రి సీతక్క

ములుగు జిల్లాలో వంద కిలోమీటర్ల గోదావరి నీటి ప్రవాహం ఉందని మంత్రి సీతక్క అన్నారు. సమైక్య రాష్ట్రంలో ములుగుకు అన్యాయం జరిగిందని, స్వరాష్ట్రంలో న్యాయం చేయాలని ఆమె కోరారు. రామచంద్రపురం గ్రావిటీ కెనాల్ ద్వారా పాకాల, కొత్తగూడెం నీటి సరఫరా చేయాలి. పొట్లాపురం కెనాల్ కోసం సంబంధిత ఫైల్‌ను ప్రభుత్వం వద్ద ఉందని, దానిని పరిశీలించి బడ్జెట్ ఇవ్వాలి. గొర్రారం, మల్లూరు, రామప్ప, లక్నవరం ప్రాంతాల్లోకి రైతులకు నీరు ఇవ్వాలని కోరారు. ఎమ్మెల్యేలు గండ్ర సత్యనారాయణరావు, కడియం శ్రీహరి, దొంతి మాధవరెడ్డి మాట్లాడుతూ దేవాదుల ప్రాజెక్టును పూర్తిచేసి పంటలకు నీళ్లివ్వాలని కోరారు. సమీక్షలో ఇరిగేషన్ కమిషనర్ ప్రశాంత్‌పాటిల్, ఇరిగేషన్ ఈఈ జగదీశ్, ములుగు మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ రేగ కల్యాణి, గ్రంథాలయ సంస్థ చైర్మన్ రవిచందర్, కాంగ్రెస్ ములుగు జిల్లా అధ్యక్షుడు పైడాకుల అశోక్, నాయకులు ఇర్సవడ్ల వెంకన్న, అప్సర్‌పాషా పాల్గొన్నారు.

ఒక్క క్లిక్‌తో ఇందిరమ్మ ఇళ్ల స్టేటస్

కలెక్టర్ రిజ్వాన్ బాషా



జనగామ: ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఇందిరమ్మ ఇళ్ల పథకంలో అర్హత పొందిన లబ్ధిదారులు తమ బిల్లులకు సంబంధించిన స్టేటస్‌ను సులభంగా తెలుసుకునేలా నూతన వెబ్‌సైట్‌ను అందుబాటులోకి తీసుకు వచ్చినట్లు కలెక్టర్ రిజ్వాన్ బాషా ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఇకపై లబ్ధిదారులకు ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ తిరగాల్సిన అవసరం లేదన్నారు. తమ ఇందిరమ్మ ఇంటి బిల్లు ఎక్కడి వరకు వచ్చింది, ఏ దశలో ఉంది, ఏ కారణంతో నిలిచిపోయిందనే పూర్తి సమాచారాన్ని ఆన్‌లైన్‌లో చూసుకోవచ్చన్నారు. జిల్లాలో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పనులు వేగంగా కొనసాగుతున్నాయని, ఈ పథకంలో గుర్తించిన లబ్ధిదారుల ఇంటి నిర్మాణ పనులు త్వరగా పూర్తి చేసే దిశగా ముందుకెళ్తున్నామన్నారు. పనుల ఆధారంగా ప్రభుత్వం నిధులను లబ్ధిదారుల ఖాతాలో నేరుగా జమ చేస్తుందని, ప్రతీ సోమవారం బిల్లుల చెల్లింపు ఉంటుందన్నారు. డబ్ల్యూడబ్ల్యూడబ్ల్యూ. ఇందిరమ్మఇండ్లు. తెలంగాణ.జీఓవీ.ఇన్ అనే వెబ్‌సైట్‌ను ఓపెన్ చేసి హోం పేజీలో స్టేటస్‌కు వెళ్లి ఆధార్ లేదా మొబైల్ లేదా ఎఫ్‌ఎస్‌సీ లేదా అప్లికేషన్ నంబర్‌ను ఎంట్రీ చేసి ఓకే చేస్తే ఇంటి నిర్మాణానికి సంబంధించిన పూర్తి వివరాలు స్క్రీన్‌పై డిస్‌ప్లే అవుతాయన్నారు. ఇందిరమ్మ ఇండ్ల పథకానికి సంబంధించి సందేహాలు నివృత్తి చేయడంతో పాటు ఫిర్యాదుల స్వీకరణకు 040–29390057 టోల్ ఫ్రీ నంబర్‌ను ప్రభుత్వం అందుబాటులోకి తీసుకువచ్చిందని కలెక్టర్ రిజ్వాన్ బాషా తెలిపారు.

హంతకులను వెంటనే గుర్తించాలి

- ఎమ్మెల్యే కడియం శ్రీహరి

జఫర్‌గఢ్: తల్లీకూతుళ్ల హత్యకు కారకులైన హంతకులను వెంటనే గుర్తించాలని ఎమ్మెల్యే కడియం శ్రీహరి పోలీసులను ఆదేశించారు. మండలంలోని తమ్మడపల్లి (ఐ) గ్రామంలో హత్యకు గురైన కుటుంబాన్ని ఎమ్మెల్యే కడియం శ్రీహరి ఆదివారం పరామర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామానికి చెందిన గాలి రాణమ్మ, తుమ్మ అన్నమ్మ అనే తల్లీకూతుళ్ల హత్యకు గురికావడం బాధాకరమన్నారు. జరిగిన ఘటనకు సంబంధించిన విచారణను వేగవంతం చేయాలన్నారు. హంతకులను వెంటనే గుర్తించి వీలైనంత తొందరలో నిందితులకు కఠిన శిక్ష పడే విధంగా చూస్తానని బాధిత కుటుంబానికి హామీ ఇచ్చారు. అనంతరం ఇదే గ్రామానికి చెందిన రడపాక కనకయ్య ఇటీవల మృతి చెందడంతో ఆయన చిత్రపటానికి ఎమ్మెల్యే పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో సింగిల్ విండో చైర్మన్ తీగల కర్ణాకర్‌రావు, నాయకులు మంచాల ఎల్లయ్య మాజీ ఎంపీపీ రడపాక సుదర్శన్, మాజీ సర్పంచ్ గాదెపాక అనిత సుధాకర్‌బాబు, తదితరులు ఉన్నారు.



బాధిత కుటుంబాన్ని పరామర్శిస్తున్న ఎమ్మెల్యే కడియం శ్రీహరి

టీఎల్‌ఎంతో సులభ బోధన

- వినూత్నం.. పర్యావరణ అనుకూలం
- విద్యార్థులు సులభంగా నేర్చుకోవచ్చు
- 18న మండల స్థాయి టీఎల్‌ఎం
- నేడు జూమ్ మీటింగ్

జనగామ: ప్రభుత్వ బడుల్లో విద్యను అభ్యసించే విద్యార్థుల్లో సృజనాత్మకతను పెంపొందించడంతో పాటు బోధనలో వినూత్న పద్ధతులను పాటిస్తూ.. పాఠ్యాంశాలను సులభంగా అర్థమయ్యే విధంగా చూపించడం టీఎల్‌ఎం (టీచింగ్ లర్నింగ్ మెటీరియల్) ఉద్దేశ్యం. ఉపాధ్యాయులు, విద్యార్థుల మధ్య పరస్పర అభ్యాసం పెంచేందుకు దోహదం చేస్తుంది. ఉపాధ్యాయులు, విద్యార్థులు తయారు చేసే మోడళ్లు, పటాలు, గేమ్స్, చార్ట్‌ల ద్వారా తక్కువ ఖర్చుతో బోధనా అభ్యాస సామగ్రిని ప్రోత్సహించి, ప్రదర్శించడానికి ఒక వేదికగా ఉపయోగపడుతుంది. ఇందుకు సంబంధించి తెలంగాణ సమగ్ర శిక్ష–నిపుణ్ భారత్ (ఎఫ్‌ఎల్‌ఎన్ మిషన్) ఈ నెల 18వ తేదీన మండల స్థాయిలో 1 నుంచి 5 తరగతుల వరకు (ప్రాథమిక స్థాయిలో)టీఎల్‌ఎం మేళాను నిర్వహించేందుకు సమగ్ర శిక్ష స్టేట్ ప్రాజెక్టు డైరెక్టర్ నవీన్ నికోలస్ మార్గదర్శకాలను విడుదల చేశారు.

1 నుంచి 5వ తరగతి వరకు..

రాష్ట్ర వ్యాప్తంగా ఈ నెల 18వ తేదీన ప్రతీ మండలంలో 1 నుంచి 5వ తరగతి వరకు బోధన–అభ్యసన–సామగ్రి మేళాను నిర్వహించనున్నారు. ఇందుకు నేడు (సోమవారం) టీఎల్‌ఎం మేళా నిర్వహణ తీరుతెన్నులను వివరించేందుకు అధికారులు జూమ్ మీటింగ్ ఏర్పాటు చేశారు. భాషా పాఠాలు, అక్షర మాల, పద బంధాలు, కథా చిత్రాలు, గణితం, సంఖ్యా మోడళ్లు, ఆకారాలు, కొలతలు, గణన పద్ధతులు, పర్యావరణం, జంతువులు, పక్షులు, రుతువులు, పటాలు, చారిత్రక స్మారకాలు, సంప్రదాయాలు, సైన్స్ ప్రయోగాలు తదితర ప్రాజెక్టులకు సంబంధించి ప్రతి తరగతి నుంచి విద్యార్థులు తక్కువ ఖర్చుతో తయారు చేసి మండల స్థాయి మేళాలో ప్రదర్శిస్తారు. ప్రదర్శనలతో సదరు ఉపాధ్యాయుల సహకారంతో ప్రాజెక్టు విధానం, తయారీ తదితర వాటిపై పిల్లలు వివరిస్తారు. మేళాలో తల్లిదండ్రులు, ప్రముఖులు పాల్గొని విద్యార్థులను ప్రోత్సహించాలి. ఉత్తమ ప్రాజెక్టులకు బహుమతులను అందిస్తారు. దీని ద్వారా బడిలో బోధించిన పాఠాలు గుర్తు పెట్టుకోవడంతో పాటు విద్యార్థుల్లో ఆత్మవిశ్వాసం పెరుగుతుంది. అలాగే ప్రాక్టికల్ నైపుణ్యం పెరిగి, టీమ్ వర్క్ ప్రాథమిక స్థాయి నుంచే డెవలప్ అవుతుంది.





పేపర్ తయారీ (ఓరిగామి)తో విద్యాబోధన

ప్రదర్శనలు ప్రయోజనాలకే పరిమితం కాకుండా..

మల్టీపుల్‌గా బోధనలో ఉపయోగపడే టీఎల్‌ఎం తయారీ, వినియోగంలో విద్యార్థులను భాగస్వామ్యం చేసే విధంగా ఉపాధ్యాయులను ఎప్పటికప్పుడు ప్రోత్సహిస్తారు. చిన్న పిల్లలు ప్రాజెక్టు తయారు చేసే సమయంలో వారికి హాని కలిగించని మెటీరియల్ మాత్రమే ఎంపిక చేసుకోవాలి. మండల స్థాయిలో ఎంఈఓ పర్యవేక్షణలో ఒక రోజు కార్యక్రమంగా నిర్వహించబడుతుంది. స్థానిక విద్యా నిపుణుల కమిటీ టీఎల్‌ఎంను మూల్యాంకనం చేస్తుంది. ప్రతీ మండలం నుంచి 10 ఉత్తమ టీఎల్‌ఎంలను ఎంపిక చేసి జిల్లాకు పంపిస్తారు. జిల్లా స్థాయిలో డీఈఓ ఆధ్వర్యంలో జిల్లా స్థాయి టీఎల్‌ఎం మేళాను నిర్వహిస్తారు. మండలాల నుంచి వచ్చిన ఎంట్రీలను ఆరుగురితో కూడిన నిపుణుల కమిటీ మూల్యాంకనం చేస్తుంది. జిల్లా స్థాయిలో అగ్రభాగాన నిలిచిన 8 టీఎల్‌ఎంలను రాష్ట్ర స్థాయికి ఎంపిక చేస్తారు. 22వ తేదీన వీడియో డాక్యుమెంటేషన్‌తో కూడిన వాటిని రాష్ట్ర కార్యాలయానికి పంపిస్తారు. మండల స్థాయిలో 18వ తేదీ నిర్వహించనుండగా, జిల్లా స్థాయి మేళాలు 20వ తేదీన ప్రదర్శన చేయనున్నారు.

అప్పటికప్పుడు తయారు చేసి...



బోధన అభ్యసన ప్రక్రియలో విద్యార్థులు, ఉపాధ్యాయులకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుంది. తక్కువ ఖర్చు, లోకాస్ట్ మెటీరియల్ ఉపయోగించి తరగతి గతికి, పాఠ్యాంశానికి అనుకూలంగా అప్పటికప్పుడు తయారు చేసి బోధన చేయడం ముఖ్య ఉద్దేశం. డ్రాయింగ్ షీట్స్ ఉపయోగించి అప్పటికప్పుడే బొమ్మలు సృష్టించి, జంతువులు, సైన్స్ సంబంధించిన బొమ్మలను రూపొందించి పిల్లలకు నేర్పించడంతో పాటు వాటి ద్వారా నాటకీకరణ, ముఖాభినయంతో సులభంగా అర్థం చేసుకుంటున్నారు. ఇలా చేయడంతో బోధనపై ఆసక్తి పెరుగుతుంది.పేపర్లతో బొమ్మలు తయారు చేసే విధానాన్ని ఓరిగామి అంటారు.

- నిమ్మ జయపాల్‌రెడ్డి, టీచర్

ఉపాధ్యాయుల సమస్యలపై పోరాటం

● టీపీఆర్‌టీయూ రాష్ట్ర నూతన అధ్యక్షుడు మన్నె చంద్రయ్య


చంద్రయ్య

విద్యారణ్యపురి: ఉపాధ్యాయుల పెండింగ్ సమస్యల పరిష్కారానికి పోరాడుతామని టీపీఆర్‌టీయూ రాష్ట్ర నూతన అధ్యక్షుడు మన్నె చంద్రయ్య ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఉద్యోగ, ఉపాధ్యాయులకు పీఆర్‌సీ ప్రకటించాలని, 317 జీఓతో నష్టపోయిన ఉపాధ్యాయులకు స్థానికత ఆధారంగా బదిలీలు చేపట్టాలని, రాష్ట్రంలో ప్రాథమిక పాఠశాలల్లో 10 వేల పీఎస్ హెచ్ఎం పోస్టులు మంజూరు చేయాలని, ఉపాధ్యాయుల ఏకీకృత సర్వీస్ రూల్స్ రూపొందించి అమలు చేయాలని కోరారు. ఇటీవల తాత్కాలికంగా నిలిచిపోయిన ఉపాధ్యాయుల పదోన్నతుల ప్రక్రియ మళ్లీ త్వరితగతిన చేపట్టాలని పేర్కొన్నారు.

పోగొట్టుకున్న బంగారం అప్పగింత


భక్తురాలికి బంగారం అందజేస్తున్న ఆలయ పర్యవేక్షకుడు విజయ్‌కుమార్

హన్మకొండ కల్చరల్ : వరంగల్ భద్రకాళి దేవాలయంలో ఓ భక్తురాలు పోగొట్టుకున్న బంగారాన్ని సిబ్బంది ఆమెకు అప్పగించారు. ఆదివారం అమ్మవారిని దర్శించుకోవడానికి హైదరాబాద్ నుంచి వచ్చిన ఓ భక్తురాలి అర్ధతులం చెవికమ్మ ఆలయ ప్రాంగణంలో పడిపోయింది. దీనిని గమనించిన ఓ వ్యక్తి ఆ ఆభరణాన్ని ఆలయ పర్యవేక్షకుడు అద్దంకి విజయ్‌కుమార్‌కు అందజేయగా ఆయన భక్తురాలికి అప్పగించారు. దీంతో భక్తురాలు.. ఆలయ సిబ్బందికి కృతజ్ఞతలు తెలిపారు.

బైక్ అదుపు తప్పి యువకుడి దుర్మరణం

● మరొకరి పరిస్థితి విషమం
● గణపురం సమీపంలో ఘటన


జగదీశ్ మృతదేహం

గణపురం: జయశంకర్ భూపాలపల్లి జిల్లా గణపురం మండలకేంద్రం సమీపంలోని కోట కాల్వ వద్ద బైక్ అదుపు తప్పింది. ఈ ఘటనలో ఓ యువకుడు అక్కడికక్కడే దుర్మరణం చెందగా మరొకరి పరిస్థితి విషమంగా ఉంది. గణపురం ఎస్సై రేఖాఅశోక్ కథనం ప్రకారం.. భూపాలపల్లికి చెందిన దాసరి జగదీశ్(24) ఏసీ టెక్నీషియన్‌గా, తన స్నేహితుడు మర్వికుసుముదార్ జగదీశ్ సింగరేణిలో ఉద్యోగం చేస్తున్నాడు ఆదివారం సెలవు సందర్భంగా ఇద్దరు బైక్‌పై రామప్పకు వెళ్లి తిరిగి స్వగ్రామం వస్తున్నారు. ఈ క్రమంలో గణపురం మండలకేంద్రం శివారు కోట కాల్వ వద్ద బైక్ అదుపు తప్పి రోడ్డుపై పడి పక్కనే ఉన్న చెట్టును ఢీకొంది. ఈఘటనలో దాసరి జగదీశ్ అక్కడికక్కడే దుర్మరణం చెందాడు. మరో యువకుడు మర్వికుసుముదార్ జగదీశ్ పరిస్థితి విషమంగా ఉంది. స్థానికుల సమాచారం మేరకు పోలీసులు ఘటనాస్థలికి చేరుకుని మృతదేహంతోపాటు క్షతగాత్రుడిని 108లో భూపాలపల్లి ఏరియా ఆస్పత్రికి తరలించారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

బెల్లం, పటిక పట్టివేత

కాజీపేట రూరల్: 80 కిలోల బెల్లం, 20 కిలోల పటికను కాజీపేట జంక్షన్‌లో పోలీసులు ఆదివారం స్వాధీనం చేసుకున్నారు. కాజీపేట జీఆర్పీ ఎస్సై ఎం.అభినవ్ తెలిపిన వివరాల ప్రకారం మహబూబాబాద్ జిల్లా ఈదులపూసపల్లి గ్రామానికి చెందిన అజ్మీరా అనిల్ ఈ నెల 9వ తేదీన ఇంటి నుంచి బల్హార్షకు వెళ్లి తక్కువ ధరకు బెల్లం, పటిక కొని తిరిగి కాజీపేటకు చేరుకుని వేరే రైలులో మహబూబాబాద్ వెళ్లేందుకు సిద్ధంగా ఉన్నాడు. ఈ క్రమంలో సమాచారం మేరకు పోలీసులు రంగంలోకి దిగి అనిల్‌ను అదుపులోకి తీసుకున్నారు. బెల్లం, పటికను స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై అభినవ్ చేసినట్లు వివరించారు.

రామప్ప కీర్తిని చాటేలా..

కాకతీయుల కళావైభవానికి ప్రతీక రామప్ప దేవాలయం. తెలుగు రాష్ట్రాల్లోనే తొలిసారి ప్రపంచ వారసత్వ సంపదగా గుర్తింపు రావడంతో రామప్ప కీర్తి మరోసారి మార్మోగింది. 1213 లో కాకతీయులు నిర్మించిన రామప్ప ఆలయానికి యునెస్కో గుర్తింపు రావడంతో దేశ,విదేశీ పర్యాటకుల సంఖ్య కూడా పెరిగింది. పర్యాటక ప్రాంతానికి మారుపేరు ములుగు జిల్లా. రామప్ప ఆలయం, లక్నవరం సరస్సు, మేడారం సమ్మక్క, సారలమ్మ జాతర, తాడ్వాయి హట్స్, ఏటూరునాగారం అభయారణ్యం, మల్లూరు లక్ష్మీనరసింహస్వామి ఆలయం, బొగత జలపాతంతో పాటు మరికొన్ని జలపాతాలు ములుగు జిల్లాకు ప్రత్యేకం. పర్యాటక జిల్లాగా పేరొందిన ములుగు జిల్లాలోని కూడళ్లను అందంగా తీర్చిదిద్దేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంది. పలుచోట్ల థీంలు ఏర్పాటు చేస్తుండడంతో కూడళ్లు జిగేల్ మంటున్నాయి.

-వెంకటాపురం(ఎం)


విద్యుత్ కాంతుల్లో డమరుకం


విద్యుత్ కాంతుల్లో నంది విగ్రహం

మరికొన్నిచోట్ల..

జిల్లాలో జంగాలపల్లి కూడలితోపాటు బండారుపల్లి రోడ్డు కూడలి వద్ద 'ఐ లవ్ ములుగు' అనే థీం ఏర్పాటు చేస్తున్నారు. సమ్మక్క–సారలమ్మ తాడ్వాయి మండలం నార్లాపూర్–బయ్యక్కపేట కూడలి వద్ద సమ్మక్క–సారలమ్మ ప్రాచుర్యాన్ని తెలిపేలా కుంకుమ భరిణె థీంను అధికారులు ఏర్పాటు చేయనున్నారు. మేడారం జాతరలోగా కుంకుమ భరిణె థీంను నెలకొల్పి ఆసియాలోనే అతిపెద్ద జాతరకు వచ్చే భక్తులకు కనువిందు చేయనున్నారు. అదేవిధంగా తాడ్వాయి మండల కేంద్రంలోని మేడారం ఆర్చీ వద్ద ఆదివాసీ జీవన విధానం, వారి సంస్కృతి, సంప్రదాయాలు తెలిపేలా 'ఆదివాసీ బాణం సంధించే థీం' ను అధికారులు ఏర్పాటు చేయనున్నారు.

కాకతీయ కళావైభవంతో మెరిసిపోతున్న జంగాలపల్లి కూడలి

● రూ.2.61 కోట్లతో పూర్తయిన సుందరీకరణ పనులు
● విద్యుత్ వెలుగుల్లో నంది విగ్రహం, డమరుకం, శిలాశాసన మండపం

జిల్లాలో రూ.2.61 కోట్లతో పలు కూడళ్లను అభివృద్ధి చేస్తున్నారు. ములుగు మండలం జంగాలపల్లి క్రాస్ వద్ద సుందరీకరణ పనులు చేపట్టి ఆదివారంతో పూర్తి చేశారు. జంగాలపల్లి క్రాస్‌లోని జంక్షన్‌లో రామప్ప

రామప్ప ఆలయ విశిష్టత తెలియజేసేలా..

ఆలయ విశిష్టత తెలియజేసేలా శివుడి వాహనమైన నందీశ్వరుడిని (నంది విగ్రహాన్ని) ఏర్పాటు చేసి మూడు పక్కల మూడు ఏనుగు విగ్రహాలను ఏర్పాటు చేశారు. అదేవిధంగా శివుడు డమరుకం వాయిస్తున్నట్లు చూపుతూ డమరుకం విగ్రహాన్ని ఏర్పాటు చేశారు. రామప్ప ఆలయాన్ని చూపే విధంగా శిలాశాసన మండపం మాదిరి మండపాన్ని నిర్మించారు. మండపం చుట్టూ ఆరుగురి మదనికల శిల్పాలను ఏర్పాటు చేశారు. అంతేకాకుండా చుట్టూ గ్రిల్స్ ఏర్పాటు చేసి లోపల గ్రాస్‌తో గ్రీనరీ ఏర్పాటు చేసి వివిధ రకాల పూలమొక్కలు నాటారు. గ్రిల్స్‌కు డమరుకం, త్రిశూలం, శివుని మూడో కన్నుతో కూడిన త్రినయనం చిహ్నాలు నిర్మించారు. రాత్రివేళ విద్యుత్ కాంతుల మధ్య నంది విగ్రహం, డమరుకం, మండపం, మదనికల భంగిమలతో కూడిన శిల్పాలు జిగేల్ మంటున్నాయి. నంది విగ్రహంతోపాటు మండపం నుంచి ఫౌంటేన్‌లా నీరు ఎగిసిపడుతుండడంతో ప్రజలు సెల్ఫీలు దిగుతూ సంబురపడిపోతున్నారు. విద్యుత్ వెలుతురులో కాకతీయ కళావైభవం ఉట్టిపడేలా జంగాలపల్లి కూడలి మెరిసిపోతోంది.


మండపం నుంచి ఫౌంటేన్‌లా జాలువారుతున్న నీరు

కబ్జా చేశాడు.. అద్దెకిచ్చేశాడు!


ఎస్సారెస్పీ భూముల్లో లారీల పార్కింగ్

● రూ.10 కోట్ల భూమి స్వాహా
● దర్జాగా ఇసుక లారీల పార్కింగ్
● అక్రమార్కుడిపై ఫిర్యాదు చేసినా స్పందించని అధికారులు

చర్యలు తీసుకుంటాం

కబ్జాదారుడిపై చర్యలు తీసుకుంటాం. ఇక్కడ నుంచి లారీల అడ్డాను తొలగిస్తాం. పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేస్తాం

-రాజు, డీఈఈ, నీటిపారుదలశాఖ

హసన్‌పర్తి: ఓ అక్రమార్కుడు దర్జాగా ఎస్సారెస్పీ భూములు ఆక్రమించాడు. అంతటితో ఆగలేదు. ఆ భూమిని అద్దెకు ఇచ్చినట్లు ఆరోపణలు వ్యక్తమవుతున్నాయి. అధికారుల సహకారంతోనే ఈ వ్యవహారం సాగుతున్నట్లు విమర్శలు వినిపిస్తున్నాయి. స్థానికులు అధికారులకు ఫిర్యాదు చేసినా స్పందించడం లేదనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. సుమారు రూ.10కోట్ల మేరకు భూమి స్వాహా చేసినట్లు స్థానికులు చెబుతున్నారు. వివరాల్లోకి వెళ్తే.. హనుమకొండ–కరీంనగర్ ప్రధాన రహదారిలోని చింతగట్టు క్యాంపులోని నీటి పారుదలశాఖ ప్రధాన కార్యాలయం సమీపంలో సుమారు రెండెకరాల ఎస్సారెస్పీ భూమి ఉంది. అయితే ఈ స్థలాన్ని మూడేళ్లుగా ఓ అక్రమార్కుడు కబ్జా చేశాడు.

దర్జాగా ఇసుక లారీల పార్కింగ్..

ఈ భూమిలో దర్జాగా ఇసుక లారీల పార్కింగ్ నిర్వహిస్తున్నారు. నెలకు ఒక్కొక్క లారీ యజమాని నుంచి కొంతమొత్తంలో అద్దె డబ్బులు వసూలు చేస్తున్నట్లు స్థానికంగా చెబుతున్నారు. ఈ మాముళ్లల్లో అధికారులకు కూడా భాగస్వామ్యం ఉన్నట్లు స్థానికులు ఆరోపిస్తున్నారు. మూడేళ్లుగా ఇక్కడ కార్యకలాపాలు కొనసాగుతున్నాయి. అలాగే, ఈ భూమిలో ఓ డబ్బా కూడా ఏర్పాటు చేశాడు. ఆ డబ్బాలను కూడా అద్దెకిచ్చినట్లు స్థానికులు చెబుతున్నారు.

అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా..

ఇసుక లారీల పార్కింగ్ అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా మారింది. ఫలితంగా ఇటు వైపు రాకపోకలు సాగించాలంటే మహిళలు ఇబ్బందులకు గురవుతున్నారు. లారీ డ్రైవర్లు మద్యం సేవిస్తూ న్యూసెన్స్ చేస్తున్నారని, దీంతో రాత్రి వేళ ఈ మార్గం నుంచి వెళ్లాలంటే భయమేస్తోందని స్థానికులు తెలిపారు. కాగా, కాలనీవాసుల ఇటీవల సమావేశం ఏర్పాటుచేసి లారీల పార్కింగ్ తొలగించకపోతే ఆందోళన చేపడుతామని హెచ్చరించినట్లు తెలిసింది.

పంటకు ప్రయోజనకారి..

● సుడోమోనాస్, ట్రైకో డెర్మావిరిడి పొడి మందులతో తెగుళ్లు అంతం..
● విత్తనశుద్ధి, భూసారం, పంట పెరుగుదల కూడా ఈ మందులతో పెంపు


విత్తన, మొక్క శుద్ధి, మిశ్రమ తయారీ విధానం

డోర్నకల్: వ్యవసాయంలో రసాయన ఎరువుల వినియోగం విరివిగా పెరుగుతోంది. దీంతో భూమిలో సారం తగ్గడంతోపాటు దిగుబడులు తగ్గుతున్నాయి. ఫలితంగా రైతులు అప్పులపాలవుతున్నారు. అంతేకాకుండా రసాయన పురుగు మందుల వినియోగంతో మిత్ర పురుగులు అంతరించడంతో పాటు వాతావరణ కాలుష్యం కూడా పెరుగుతోంది. ఫలితంగా నేల కాలుష్యంతో నేలసారం తగ్గడం, వ్యవసాయ ఉత్పత్తుల్లో పురుగు మందుల అవశేషాలు ఉండి నాణ్యతాపరమైన సమస్యలు తలెత్తుతున్నాయి. ఇలాంటి అనేక దుష్పరిమాణాలను దృష్టిలో ఉంచుకుని వీటిని అధికమించడానికి సమగ్ర సస్యరక్షణ పద్ధతులను రూపొందించారు. ఇందులో భాగంగా రసాయన మందులకు ప్రత్యామ్నాయంగా జీవశిలీంధ్ర నాశినిలుగా గుర్తింపు పొందిన సుడోమోనాస్, ట్రైకోడెర్మావిరిడి పొడి మందులను వినియోగంలోకి తీసుకొచ్చి కాలుష్యాన్ని అరికడుతూ తక్కువ పెట్టుబడితో ఎక్కువ లాభం పొందేందుకు శాస్త్రవేత్తలు కృషి చేస్తున్నారు. సుడోమోనాస్, ట్రైకోడెర్మావిరిడి వినియోగంతో విత్తనశుద్ధి, పంట ఎదుగుదల, తెగుళ్ల నివారణ లాంటి ప్రయోజనాలు ఉన్నాయి. సుడోమోనాస్ బ్యాక్టీరియా మొక్కల్లో ఆక్సిజన్, జిబ్బరిలిన్లను ఉత్పత్తి చేసి పంట ఎదుగుదలకు సహాయపడడమే కాకుండా వ్యాధి నిరోధకశక్తిని పెంచుతాయి. పంట తొలిదశలో వీటిని వినియోగిస్తే ఎక్కువ సమర్థవంతంగా పని చేస్తాయి. సుడోమోనాస్ కేజీ రూ.150, ట్రైకోడెర్మావిరిడి కేజీ రూ.100 చొప్పున వ్యవసాయ కార్యాలయాలు, ఫర్టిలైజర్ దుకాణాల్లో లభ్యమవుతాయి.

సుడోమోనాస్, ట్రైకోడెర్మా విరిడి పొడి మందులు వినియోగించే పద్ధతులు..

విత్తన శుద్ధి..

కిలో విత్తనానికి 8–10 గ్రాముల పొడిమందు సరిపోతుంది. లేదా పొడి మందు 10 మి.లీ నీటితో కలిపి విత్తనశుద్ధి చేయొచ్చు. అరటి, పసుపు దుంపలు, చెరుకు ముచ్చెలను శిలీంధ్ర ద్రావణంలో కలిపి ముంచి నాటాలి. 500 గ్రాముల ట్రైకోడెర్మావిరిడి పొడి 100 లీటర్ల నీటిలో కలిపి ఉపయోగించుకోవాలి.


మిశ్రమాన్ని సిద్ధం చేస్తున్న రైతులు

వేర్లను శుద్ధి చేయడం..

వరి, వంకాయ, టమాట, మిరప పైర్లను కిలో సుడోమోనాస్ ఫార్ములేషన్ నిల్వ ఉండే నీళ్లలో కలిపి వాటి వేర్లను గంట సమయం పాటు ఈ నీటిలో ఉంచిన తర్వాత నాటకుంటే తెగుళ్లను నివారించడమే కాకుండా పెరుగుదలను పెంచుతుంది.

భూమిలో చల్లే విధానం..

ఎకరాకు 2 నుంచి 3 కిలోలు దుక్కిలో వేయాలి. కిలో సుడోమోనాస్ ఫ్లోరోసెన్స్, 10 కిలో గ్రాముల వేప పిండి, 90 కిలోగ్రాముల బాగా చితికిన పశువుల ఎరువుతో మిశ్రమాన్ని తయాలు చేసి వారం రోజులు నీడలో ఉంచి దుక్కిలో వేసుకోవాలి. వేప పిండి, పశువుల ఎరువు అందుబాటులో లేకుంటే ఇసుకతో కలిపి వాడొచ్చు.

పిచికారీ..

కిలో పొడి మందును 100 లీటర్ల నీటిలో కలిపి ఎకరా పైరుపై పిచికారీ చేయాలి.

వినియోగంలో ఈ జాగ్రత్తలు పాటించాలి...

- వినియోగించే ముందు భూమిలో తేమ ఉండేలా చూసుకోవాలి.
- వీటిని కంపోస్ట్, ఇతర పశువుల ఎరువులు, జీవ సంబంధ పదార్థాలతో కలిపి వాడొచ్చు.
- రసాయన పురుగుమందులతో కలిపి వాడకుంటే పంటలకు మేలు.
- చల్లని ప్రదేశంలో నిల్వ చేయాలి.
- మిశ్రమాన్ని తయారు చేసిన ఆరు నెలల లోపు వాడాలి.

పంట పేరు	సుడోమోనాస్, ట్రైకోడెర్మా విరిడి పొడి మందులతో అరికట్టే తెగుళ్లు
వరి	అగ్గితెగులు, మెడవిరుపు, పాముపొడ తెగులు
పత్తి	(బ్యాక్టీరియా), ఎండు తెగులు
మిరప	నారుకుళ్లు, వేరుకుళ్లను నివారిస్తాయి
వేరుశనగ	ఆకుపచ్చ, ఎండుతెగుళ్లు
మినుము, శనగ	ఎండుతెగుళ్లు
పొద్దుతిరుగుడు	వేరుకుళ్లు
మామిడి	నల్లమచ్చల తెగుళ్లు(ఆన్ త్రక్నస్)
పామాయిల్	మొక్క ఎదుగుదల, దిగుబడి పెరగడం (సుడోమోనాస్, ట్రైకోడెర్మావిరిడి కలిపి వాడాలి)

సురేశ్‌కు జాతీయ పురస్కారం


పురస్కారం అందుకుంటున్న సురేశ్

ఎల్కతుర్తి: హనుమకొండ జిల్లా భీమదేవరపల్లి మండలం కొప్పూరు గ్రామానికి చెందిన నల్లగొండ సురేశ్ గిడుగు రామ్మూర్తి స్మారక జాతీయ పురస్కారం అందుకున్నారు. తెలుగు భాషా దినోత్సవం జాతీయ శతాధిక కవి సమ్మేళనాన్ని పురస్కరించుకొని ఆదివారం కరీంనగర్‌లోని ఫిలింభవన్‌లో నిర్వహించిన కార్యక్రమంలో తెలుగు కళారత్నాలు సాంస్కృతిక సేవ సంస్థ సీఈఓ ఉలవలపుడి వెంకటరత్నం, జాతీయ కమిటీ ప్రోగ్రాం డైరెక్టర్ ధనశి ఉషారాణి, భవాని సాహిత్య సంస్థ వ్యవస్థాపక అధ్యక్షుడు వైరాగ్యం ప్రభాకర్ చేతుల మీదుగా సురేశ్ పురస్కారం అందుకున్నారు. కాగా, సురేశ్ నవయుగ శతకం, దశధీరులు, కావ్య ఖండికతో పాటు అనేక పద్యాలు, రచనలు రాశారు. సురేశ్ ప్రస్తుతం భూపాలపల్లి జిల్లా కాటారం మండలం ఇడిపిలవంచ గ్రామ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయుడిగా విధులు నిర్వర్తిస్తున్నారు. ఈ సందర్భంగా కొప్పూరు గ్రామస్తులు, సహ ఉపాధ్యాయులు.. సురేశ్‌కు శుభాకాంక్షలు తెలిపారు.

గుర్తుతెలియని వాహనం ఢీ..

● ముగ్గురికి తీవ్ర గాయాలు
● కక్కిరాలపల్లి క్రాస్ సమీపంలో ఘటన


ఘటనాస్థలిలో క్షతగాత్రులు, బైక్

ఐనవోలు: గుర్తుతెలియని వాహనం ఢీకొన్న ప్రమాదంలో ముగ్గురికి తీవ్ర గాయాలయ్యాయి. ఈ ఘటన ఆదివారం సాయంత్రం మండలంలోని కక్కిరాలపల్లి క్రాస్ సమీపం వరంగల్–ఖమ్మం రహదారిపై చోటు చేసుకుంది. స్థానికులు, పోలీసుల కథనం ప్రకారం.. మండలంలోని పున్నేలు గ్రామానికి చెందిన చాట్ల నవీన్, వరుసకు బావ మరుదులైన ధర్మసాగర్ మండలం క్యాతంపల్లి గ్రామానికి చెందిన జక్కుల సన్నీ, జక్కుల బన్నీ వరంగల్ జిల్లా వర్ధన్నపేట మండలం ఉప్పరపల్లి క్రాస్ సమీపంలోని ఓ ఫంక్షన్ హాల్‌లో పెళ్లి వేడుకకు హాజరయ్యారు. అనంతరం నవీన్ ద్విచక్ర వాహనంపై బావమరదులు సన్నీ, బన్నీలతో కలిసి పున్నేలుకు బయలుదేరాడు. ఈ క్రమంలో కక్కిరాలపల్లి క్రాస్ సమీపంలో వరంగల్–ఖమ్మం రహదారిపై గుర్తు తెలియని వాహనం ఢీ కొనగా ముగ్గురికి తీవ్ర గాయాలయ్యాయి. అటువైపు వెళ్తున్న ప్ర యాణికులు గమనించి 108 వాహనానికి సమాచారం అందించారు. అయితే ప్రమాదం జరిగి గంటదాటినా ఘటనా స్థలికి 108 వాహనం రాకపోవడంపై పలువురు మండిపడ్డారు. తీవ్ర గాయాలైన ఒకరిని ముందు ఆటోలో తరలించగా మరో ఇద్దరిని 108లో ఆస్పత్రికి తరలించారు.

బొగతలో పర్యాటకుల సందడి..



వాజేడు: ములుగు జిల్లా వాజేడు మండలం చీకుపల్లి సమీపంలో ఉన్న బొగత జలపాతం వద్ద పర్యాటకులు సందడి చేశారు. ఆదివారం సెలవుదిన కావడంతో భారీ సంఖ్యలో తరలొచ్చారు. ఈ సందర్భంగా జలపాతం జలధారలను వీక్షించడంతోపాటు సెల్ ఫోన్లలో బంధించారు. కొలనులో స్నానాలు చేస్తూ సెల్ఫీలు, ఫొటోలు దిగి సందడి చేశారు. ప్రకృతి అందాలకు ఫిదా అయ్యారు. నడిచి వెళ్లలేని పర్యాటకుల కోసం రైడర్ వాహనం ఏర్పాటు చేసి జలపాతం వద్దకు తరలించారు.

కుటుంబ కలహాలతో యువకుడి ఆత్మహత్య

● తాళ్లపూసపల్లిలో ఘటన


మురళి మృతదేహం

కేసముద్రం: కుటుంబ కలహాలతో ఓ యువకుడు గడ్డి మందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ ఘటన మండలంలోని తాళ్లపూసపల్లిలో చోటుచేసుకుంది. ఎస్సై మురళీధర్‌రాజు కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన వలసాని మురళి(39) కొంత కాలంగా మద్యానికి బానిసై భార్య రేణుకతో తరచూ గొడవ పడుతూ చనిపోతానని బెదిరించేవాడు. ఈ క్రమంలో శనివారం మురళి భార్య రాఖీ పండుగ సందర్భంగా తన తల్లిగారింటికి వెళ్లింది. ఇంట్లో ఒంటరిగా ఉన్న మురళి మద్యం తాగి మత్తులో చెరువుకట్టపై గడ్డిమందు తాగి పడిపోయాడు. స్థానికులు గమనించి కుటుంబీకులకు సమాచారం అందించడంతో వారు వరంగల్ ఎంజీఎం తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మురళి అదే రోజు రాత్రి 11 గంటల సమయంలో మృతి చెందాడు. ఈ ఘటనపై మృతుడి అన్న యాకన్న ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై ఆదివారం తెలిపారు.

ఆర్థిక ఇబ్బందులతో రేపాకలో వ్యక్తి..

రేగొండ: ఆర్థిక ఇబ్బందులతో జీవితంపై విరక్తి చెందిన ఓ వ్యక్తి ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ ఘటన మండలంలోని రేపాకలో చోటు చేసుకుంది. ఎస్సై షాఖాన్ కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన సామర్ల బాబు (47) ఆర్థిక ఇబ్బందులతో మద్యానికి బానిసయ్యాడు. జీవితంపై విరక్తి చెంది శనివారం ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మృతుడి కుమారుడు రాజు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు. మృతుడికి భార్య అహల్య, ఇద్దరు కుమారులు రాజు, అజయ్ ఉన్నారు.

దేవాదుల, సమ్మక్క బ్యారేజీని పరిశీలించిన మంత్రులు


దేవాదుల నీటిని చూపిస్తున్న ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టివిక్రమార్క


సమ్మక్క బ్యారేజీని పరిశీలిస్తున్న మంత్రులు

ఏటూరునాగారం/కన్నాయిగూడెం: ములుగు జిల్లా కన్నాయిగూడెం మండలం తుపాకులగూడెంలోని సమ్మక్క–సాగర్ బ్యారేజీ, దేవాదుల వద్ద పంపుహౌస్‌ను మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టివిక్రమార్క, మంత్రులు సీతక్క, కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, వాకిటి శ్రీహరి, ఎంపీ బలరాంనాయక్, ఎమ్మెల్యేలు కడియం శ్రీహరి, గండ్ర సత్యనారాయణరావు, ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి ఆదివారం సందర్శించారు. ప్రాజెక్టులోని పలు దశల పనులను అధికారులు మంత్రులకు వివరించారు. అనంతరం నిర్వహించిన సమీక్షలో మంత్రులు మాట్లాడారు.

జీజీహెచ్ భవనం పైనుంచి పడి రోగి మృతి


ఐలయ్య (ఫైల్)

నెహ్రూసెంటర్: ఓ రోగి ప్రమాదవశాత్తు మహబూబాబాద్ ప్రభుత్వ జనరల్ ఆస్పత్రి మూడో అంతస్తు నుంచి పడి మృతి చెందాడు. మృతుడి బంధువుల కథనం ప్రకారం... మహబూబాబాద్ జిల్లా ఇనుగుర్తి మండలం చిన్న నాగారం గ్రామానికి చెందిన నాయిని ఐలయ్య (55) జ్వరంతో బాధపడుతూ ఈ నెల 7వ తేదీన జీజీహెచ్‌కు వచ్చాడు. ఈ క్రమంలో ఆదివారం తెల్లవారుజామున చికిత్స పొందుతున్న వార్డు బాల్కనీ నుంచి ప్రమాదవశాత్తు జారి కిందపడడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. పోలీసులు ఆస్పత్రికి చేరుకుని ఘటనపై వివరాలు నమోదు చేసుకున్నారు. మృతుడికి భార్య యాదమ్మ, ఇద్దరు పిల్లలు ఉన్నారు.